




జాతీయ **వార్త**
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి
**జాతీయ వార్త తెలుగు దినపత్రిక**
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761



ఆదివారం | 11-10-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 806 పేజీలు: 4 వెల: రూ.7


# ఎంజీఆర్.. స్పందించారు



- పారాపురం దళితుల శ్మశాన వాటిక రహదారి సమస్యపై కదిలిన ఎమ్మెల్యే
- 'జాతీయ వార్త'లో కథనంతో పారాపురం వచ్చిన టీడీపీ నేతలు
- గ్రామస్థులతో లయికిసి సమస్య తీవ్రత పరిశీలన
- ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన నేతలు
- రహదారి సదుపాయం కల్పించాలని తహశీల్దార్‌ను ఆదేశించిన ఎమ్మెల్యే
- జాతీయ వార్త యాజమాన్యానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు, దళిత నాయకులు

జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక **ఎఫెక్ట్**

కొత్తూరు, అక్టోబర్ 10 (వార్త): పారాపురం గ్రామ దళితుల శ్మశానవాటికకు రహదారి సౌకర్యం కల్పించాలన్న సమస్యపై 'జాతీయ వార్త'లో ' ఓట్లప్పుడు దండా.. చావుకొస్తే దగా' పేరిట ప్రచురితమైన కథనానికి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సత్వరమే స్పందించారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆయన క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక నాయకులకు సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కొత్తూరు మాజీ సర్పంచ్ ప్రతినిధి టోంపల తిరుపతిరావు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు లోతుగడ్డ ఆనందరావు శనివారం పారాపురం శ్మశానవాటికను సందర్శించారు. స్థానిక దళిత నాయకులు, గ్రామస్తులతో మాట్లాడారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. సమస్యకు సంబంధించిన వివరాలను



ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వెంటనే కొత్తూరు తహసీల్దార్‌తో మాట్లాడి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించేందుకు సర్వేయర్‌ను పంపిస్తామని తెలిపారు. సర్వే అనంతరం నివేదికను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి, శ్మశానవాటికకు శాశ్వత రహదారి సౌకర్యం కల్పించేలా పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. తమ సమస్యపై 'జాతీయ వార్త'లో ప్రచురితం చేసిన యాజమాన్యానికి, స్పందించిన ఎమ్మెల్యేతో పాటు అధికారులకు పారాపురం దళిత నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



ఆదివారం | 10-10-2026 | శ్రీకాకుళం

ఓట్లప్పుడు.. దండాలు..
చావుకొస్తే దగా!

* శతాబ్ద కాలంగా శవాలతో దళిత కుటుంబాల నరకయాతన? * శ్మశానానికి దారి లేదు..
* కలగానే కమ్యూనిటీ హాల్? * పారాపురం, కొత్తూరు సరిహద్దు దళితుల రోదనలు పట్టవా?
* పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల బహిష్కరిస్తామని గ్రామస్థుల హెచ్చరిక

కొత్తూరు, అక్టోబర్ 9 (వార్త): ఎన్నికలొస్తే చాలు.. చేతులు జోడించి కల్లబొల్లి మాటలు చెప్పడం.. గెలిచాక దళితవాడల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం.. దశాబ్దాలుగా నాయకులు ఆడుతున్న ఈ రాజకీయ నాటకానికి శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలంలోని దళితులు బలవుతున్నారు. మనిషి బతికి ఉన్నప్పుడే కాదు, చనిపోయాక కూడా గౌరవంగా సాగనంపేందుకు కనీస రహదారి సౌకర్యం లేక కొత్తూరు సరిహద్దు పారాపురం గ్రామాల దళిత ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారాపురం గ్రామం, కొత్తూరు బౌండరీ పరిధిలో సుమారు 250 కుటుంబాలు, 500 మందికి పైగా దళిత ఓటర్లు వందేళ్లుగా కలసిమెలసి జీవిస్తున్నారు. వీరందరికీ కలిపి ఉన్న ఏకైక శ్మశాన వాటికకు వెళ్లడానికి నేటికీ దారి లేదు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు శవాన్ని భుజాలపై మోస్తూ, ముళ్లకంపలు, రాళ్లగుట్టల మధ్య పడే నరకయాతన వర్ణనాతీతం. "తరాలు మారుతున్నాయి.. నాయకులు మారుతున్నారు.. కానీ మా శవాల మోతకు దారి దొరకడం లేదు" అని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. గతంలో ఎలాగడ చెరువు గట్టు పక్కన శ్మశాన వాటికకు 12 సెంట్లు, దళిత కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 10 సెంట్లు భూమి కేటాయించారు. ఆ స్థలాన్ని గ్రామస్థులే కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు. అయితే, గత ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఆ స్థలాల అభివృద్ధి పేరిట కాగితాలపై పనులు చూపించి స్వార్థ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో రూపాయి పని కూడా చేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ మొదలుకొని ఎమ్మెల్యే స్థాయి వరకు ఎన్నికలొచ్చినప్పుడు ఇచ్చిన హామీలు గెలిచాక బూడిదలో పోసిన పన్నీరయ్యాయని మండిపడుతున్నారు.

ఎమ్మెల్యే గారూ.. మా ఆర్తనాదాలు వినండి...!

ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, మండల ఉన్నతాధికారులు స్పందించి పారాపురం-కొత్తూరు దళితుల దీర్ఘకాలిక సమస్య అయిన శ్మశానవాటిక రహదారి, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను తక్షణమే చేపట్టాలని దళిత పెద్దలు డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికీ అలసత్వం ప్రదర్శిస్తే రానున్న రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని, భవిష్యత్ ఎన్నికలను సంపూర్ణంగా బహిష్కరిస్తామని ముక్తకంఠంతో హెచ్చరించారు. ఈ నిరసనలో దళిత గ్రామ పెద్దలు కింజరాపు సింహాచలం, గర్భక రామారావు, కొర్ర రవి, యందవ జీవ, లీసి రామకృష్ణ, తూత సవరయ్య, వజ్రగడ్డ కృష్ణారావు, బొడ్డేపల్లి సుందరరావు, దార రాము, కళ్లపల్లి ఆనందరావు, జర్జన తిరుపతిరావు, యాళ్ల సుందరరావు, లోపింటి వెంకటరమణరావుతో పాటు అంబేద్కర్ భీమ్ సేన నాయకులు ఊర్జన రాజీవ్, జర్జన విజయ్, వికాస్, గువ్వాడ కృష్ణ, లీసి శంకరరావు, తూత శంకరరావు, సవలాపురపు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

- జిల్లాలో పలుచోట్ల మండపాలు ఏర్పాట్లు
- దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఈనెల 20 వరకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు
- ధగధగ మెరుస్తున్న దుర్గమ్మ ఆలయాలు
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు





శ్రీకాకుళం, సెప్టెంబర్10 (వార్త): దసరా శరన్నవరాత్రులు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకునే అతిపెద్ద పండుగలలో ఒకటి. శరద్రుతువు ఆరంభంలో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఆఖరి రోజున విజయదశమి (దసరా) పండుగను చేసుకుంటారు. తొమ్మిది రోజులు పాటు అమ్మవారికి వివిధ రూపాల్లో అలంకరించనున్నారు. జిల్లాలో పలుచోట్ల దుర్గమ్మ మండపాలను ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి విశేష పూజలు చేయనున్నారు. శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, పాతబస్టాండ్, కొత్తరోడ్డు తదితర ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేశారు. అలాగే నరసన్నపేట, పలాస, టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం, పాతపట్నం, తదితర ప్రాంతాల్లో దుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. పాతపట్నం నీలమణి దుర్గమ్మ, కొత్తపేట కొత్తమ్మ తల్లి, కంచిలి కంచమ్మతల్లితో పాలు దుర్గమ్మ ఆలయాలను కమిటీలు, నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఆలయాలు విద్యుద్దీపాలతో ధగధగమెరుస్తున్నాయి.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సోంపేట నిర్లక్ష్యంపై సోషల్ మీడియాలో రచ్చ!

**- దశాబ్దాల చరిత్రకు కానరాని మార్పు**

**- ఇరుకైన మెయిన్ రోడ్డు పై సర్వజన ఘోష**

**- పాలకులు మారడమే తప్ప ..**

**పని తీరు లేదంటూ విమర్శలు**

(సోంపేట)

దశాబ్దాల చరిత్ర గల సోంపేట ఇప్పటికి దశమారలేదు. ఎక్కడి సమస్యలు అక్కడే నిద్రపోతున్నాయి. ప్రధాన సమస్యలపై నాయకులు దృష్టి సారించడం లేదు. ప్రజలు ఎన్ని ఆశలు పెట్టుకుంటున్నా అభివృద్ధి విషయంలో అన్ని అడియాసలుగానే మిగులుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాయకులు అధికారపక్షం పై విమర్శలు చేయడం తప్ప తిరిగి అధికారంలోకి వచ్చాక సోంపేట విషయంలో సాధించింది ఏమీ లేదనే చెప్పవచ్చు. సోంపేట అనగానే అరకొర అభివృద్ధి తప్ప ముఖ్య సమస్యలు విషయంలో నేతల మౌనం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సోంపేట విషయంలో నెలకొన్న నిర్లక్ష్యం పట్ల తాజాగా సోషల్ మీడియా వేదికగా రచ్చ రచ్చ జరుగుతుంది. దీని పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

సోంపేట పరిస్థితి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెతల మారిందని నెటిజన్లు వాపోతున్నారు. సోంపేటలో భారీ వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టినప్పటికీ సరైన వైద్య సదుపాయాలు లేవంటూ, వైద్యులు పనితీరు సరిలేదంటూ విమర్శలు గుప్పుమంటున్నాయి.

సోంపేట పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందంటూ సోషల్ మీడియాలో విమర్శలు ఎక్కు పెడుతున్నారు. ఇండ్ల నిర్మాణం విషయంలో ప్లానింగ్ లేకపోవడం, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడం, గ్రామపంచాయతీ అధికారులు అలసత్వవైఖరి, రాజకీయ నేతల్లో కరువైన చిత్తశుద్ధి మొదలైన కారణాలతో వర్షం పడితే ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయే పరిస్థితులు అనేక చోట్ల నెలకొని ఉన్నాయి.

ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజలు ఇక్కడ ప్రధాన రోడ్డు విషయంలో నెలకొన్న నిర్లక్ష్యం అంతా ఇంత కాదంటూ తీవ్రంగా విమర్శిస్తున్నారు. పూర్వకాలం నాటి ఇరుకైన రోడ్డులోనే ఇంకా ప్రయాణాలు




సాగడంతో నిరంతరం ట్రాఫిక్ జామ్ సమస్య ప్రజలకు తీవ్ర తలనొప్పిగా మారింది. 60 అడుగుల వెడల్పైన సోంపేట రోడ్డు ఆక్రమణలతో బక్కచిక్కి అనేక చోట్ల 30 అడుగులకే పరిమితమైంది.

వీటి పర్యవసానంగా సోంపేట మార్కెట్ తిరోగమనంలో పయనిస్తోంది. లక్షలు రూపాయలు పెట్టుబడులతో చేపడుతున్న వ్యాపారాలు సక్రమంగా లేవంటూ వ్యాపారుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతుంది.

మెయిన్ రోడ్ లో పార్కింగ్ సమస్య ప్రతి ఒక్కరిని వెంటాడుతోంది. షాపింగ్ పనులపై వచ్చే వివిధ ప్రాంతాల వ్యక్తులు వాహనాలు గత్యంతరం లేక రోడ్డుపైనే నిలపాల్సి వస్తుంది. ఈ పరిస్థితి ట్రాఫిక్ సమస్యకు గుదిబండగా మారుతుంది.

స్థానిక ప్రజలు సాయంత్రం వేళ కనీసం సేద తీరేందుకు పట్టణంలో ఒక పార్కు కూడా లేదంటే అతిశయోక్తి కాదు. పార్కు కోసం అయ్యప్ప గుడి ఆవరణలో కేటాయించిన స్థలంలో చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి బోర్వెల్ ఏర్పాటు చేసి పాలకులు, అధికారులు ఏళ్ల తరబడి అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

### యువకుల్లారా మేల్కోండి ..

ఇటువంటి ప్రధాన సమస్యలు దశాబ్దాలుగా నెలకొని ఉన్న సోంపేట పట్టణంలో అధికారులు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై యువత ఇప్పటికైనా మేల్కొనాలని, సొంత ఊరి పట్ల బాధ్యత వహించి ఉద్యమానికి సిద్ధం కావాలని సోషల్ మీడియా వేదికగా పిలుపునిస్తున్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు పట్టణాన్ని చూసి ప్రతి ఒక్కరూ నివ్వెరపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన రోడ్డు మార్గం లేక పట్టణంలో అడుగుపెట్టేందుకు అందరూ




ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో పాలకుల వైఖరి మారేంతవరకు కలసి పోరాడుదాం అంటూ సోషల్ మీడియాలో వినిపిస్తున్న పిలుపు ఏ మేరకు కార్యరూపం దాల్చుతుందో వేచి చూడాల్సి ఉంది.

## నేటి నుంచి మందసలో దుర్గాదేవి నవరాత్రి పూజా మహోత్సవాలు




**మందస, అక్టోబరు 10(వార్త):** మందసలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి నవరాత్రి పూజా మహోత్సవములు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 11న శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా, 12న శ్రీ గాయత్రీ దేవిగా, 13న శ్రీ అన్నపూర్ణ దేవిగా, 14న శ్రీ మహాచండి దేవిగా, 15న శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా, 16న శ్రీసరస్వతీదేవిగా, 17న శ్రీ మహాలక్ష్మీదేవిగా, 18న శ్రీ దుర్గాదేవిగా, 19న శ్రీ మహిషాసుర మర్ధిని దేవిగా, 20న శ్రీ రాజరాజేశ్వరి దేవి గా దుర్గాదేవి దర్శనమిస్తారని శ్రీదుర్గాదేవి నవరాత్రి మహోత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దేవి శరన్నవరాత్రులలో గ్రామప్రజలలో ఎవరికైనా ఆసక్తి ఉంటే పూజా కార్యక్రమంలో పాల్గొనవచ్చున్నారు. అడ్వాన్స్‌గా పేరు నమోదు చేసుకోగలరని కోరారు. భక్తులు కార్యక్రమాలలో పాల్గొని, అమ్మవారి తీర్థప్రసాదములు స్వీకరించి, దేవి నవరాత్రులను దిగ్విజయంగా జరిపించి, శ్రీశ్రీశ్రీ దేవి కృప, కరుణలను పొందు తారని కోరారు. మరిన్ని వివరాలకు 7569470069, 9989436743 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

## అంబుగాంలో విద్యార్థులకు దుస్తుల పంపిణీ



**మందస, అక్టోబరు 10(వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత వర్ష జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీ సత్యసాయి విద్యా జ్యోతి కార్యక్రమంలో భాగంగా మందస మండలంలోని అంబుగాం మోడల్ ప్రాథమిక పాఠశాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాసం శ్రీనివాసరావు, కుటుంబ సభ్యుల సౌజన్యంతో 60మంది విద్యార్థులకు శ్వేత వస్త్రాలు(వైట్ యూనిఫామ్స్) ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ పప్పల నాగేశ్వరరావు, పలాస జోనల్ కన్వీనర్ బమ్మిడి బైరాగి, మందస సమితి కన్వీనర్ ఈశ్వరరావు హాజరై విద్యార్థులకు స్వయంగా యూనిఫామ్స్ అందజేశారు. జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు మాట్లాడుతూ బాబా దివ్య సందేశాన్ని వినిపించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సత్ప్రవర్తన, క్రమశిక్షణ వంటి మంచి అలవాట్లను అలవర్చుకుని సమాజంలో ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే రాబోయే స్వామివారి జయంతి వేడుకలతో పాటు డిసెంబర్ మాసంలో నిర్వహించనున్న 'శ్రీకాకుళం జిల్లా పుట్టపర్తి యాత్ర'లో విద్యార్థుల తల్లిదండ్రులు విశేష సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గున్న రమేష్, దాసరి ఈశ్వరరావు, గొల్లంగి సాయమ్మ, నల్ల జీవిత, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ గుసిరి వనిత, వైస్ చైర్మన్ గంగిట్ల పాపారావులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పల్లెలు ప్రశాంతతకు నిలయాలు కావాలి

**-ఎన్నికలు దృష్ట్యా శాంతియుతంగా ఉండాలి**

**-కక్షలు, కార్పణ్యాలు మానుకోవాలి**

**- మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్**

**మందస, అక్టోబరు 10(వార్త):** పల్లెలు ప్రశాంతతకు నిలయాలు కావాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో శాంతియుతంగా ఉండాలని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందస మండలంలోని బొగాబంద, బసవసాయి, డిమిరియా, ఉమాగిరి గ్రామాల సందర్శన, పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎస్ఐ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు దృష్ట్యా ప్రజలు సమన్వయంతో మెలగాలని పిలుపునిచ్చారు. శాంతి, భద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. పల్లెలు ప్రశాంతానికి నిలయం కావాలని, శాంతి, భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని హితవు పలికారు. పోలీసులు ప్రజలకు మిత్రులను, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కొరారు. పోలీసులు ప్రజలకు చేరువగా ఉంటారని, సమస్యలను తెలియజేయాలన్నారు. శాంతిభద్రతలను పటిష్ఠం చేసేందుకు పోలీసులకు సహకరించాలన్నారు. రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం సమస్యలు, భద్రతా అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. సైబర్ నేరాలు, వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## నిరుపయోగంగా బుడితి డీసీసీబీ ఏటీఎం

**- కొద్ది రోజులకే నిలిచిన సేవలు**

**- నగదు డ్రా చేసుకోలేక వెనుదిరుగుతున్న ఖాతాదారులు**

**- నగదు అందుబాటులో ఉంచి సేవలు పునరుద్ధరించాలని స్థానికుల విజ్ఞప్తి**

**సారవకోట, అక్టోబరు 10 (వార్త):** బుడితి బస్టాండ్ సమీపంలోని ప్రాథమిక పరపతి సంఘం కార్యాలయ ప్రాంగణంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ఏర్పాటు చేసిన ఏటీఎం ఖాతాదారులకు ఉపయోగపడటం లేదు. ఏటీఎం ఏర్పాటు చేసిన కొద్దిరోజులకే నగదు అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం అది నిరుపయోగంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుడితి బస్టాండ్ సమీపంలో ఏటీఎం ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఖాతాదారులకు నగదు ఉపసంహరణ సులభమవుతుందని భావించారు. అయితే, ప్రస్తుతం ఏటీఎంలో నగదు లేకపోవడంతో అవసరమైన సమయంలో డబ్బులు తీసుకునేందుకు వచ్చినవారు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని చెబుతున్నారు. ఏటీఎం అందుబాటులో ఉన్నప్పటికీ నగదు డ్రా చేసుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. బ్యాంకు లావాదేవీల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా




అత్యవసర సమయాల్లో నగదు అవసరమైనప్పుడు ఏటీఎం పనిచేయకపోవడం అసౌకర్యంగా మారుతోందని స్థానికులు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడేలా ఏర్పాటు చేసిన ఏటీఎంలో నగదు లేకపోవడం వల్ల దాని లక్ష్యం నెరవేరడం లేదని అభిప్రాయపడ్డారు. సంబంధిత బ్యాంకు అధికారులు స్పందించి ఏటీఎంలో నిరంతరం నగదు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఏటీఎం సేవలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, ఖాతాదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## ముగిసిన అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ



**నరసన్నపేట, అక్టోబరు 10 (వార్త):** నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తల శిక్షణా తరగతులు ముగిశాయి. ఈ విషయాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) పి. శోభారాణి తెలిపారు. ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిన్నారుల ప్రాథమిక విద్యాభివృద్ధిలో అంగన్వాడీ కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్‌పై ప్రత్యేకంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. చిన్నారుల వయసుకు తగిన బోధనా పద్ధతులు, ఆటపాటల ద్వారా విద్యను అందించడం, వారిలో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. బాల్యంలోనే పిల్లలకు పటిష్ఠమైన విద్యా పునాది వేయడానికి ఈ పద్ధతులు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. శిక్షణ ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకుని, చిన్నారులకు మరింత సమర్థవంతంగా విద్యాబోధన అందించేందుకు అవకాశం ఉంటుందని శోభారాణి పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధుల్లో ఆచరణలో పెట్టి, పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ప్రీస్కూల్ దశ నుంచే పిల్లల్లో విద్య పట్ల ఆసక్తి, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంలో అంగన్వాడీ కేంద్రాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆమె తెలిపారు. శిక్షణలో పొందిన జ్ఞానాన్ని వినియోగించి చిన్నారులకు మెరుగైన విద్యాబోధన అందించాలని కార్యకర్తలకు సూచించారు.

## రావాడపేట కాలనీ సమస్యలపై రగడ

**- వైసీపీ, టీడీపీ నేతల మధ్య విమర్శలు**

నరసన్నపేట, అక్టోబరు 10 (వార్త): రావాడపేట జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించేందుకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మాన కృష్ణ చైతన్య చేపట్టిన పర్యటనపై టీడీపీ నేతలు చేసిన విమర్శలకు వైసీపీ నాయకులు శనివారం ఘాటుగా స్పందించారు. కాలనీలోని సమస్యలపై దృష్టి సారించాల్సిన సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వడం తగదని వారు పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లుగా జగనన్న కాలనీలోని సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని వైసీపీ నాయకులు ఆరోపించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ధర్మాన కృష్ణ చైతన్య పర్యటిస్తే టీడీపీ నేతలు ఉలిక్కిపడి అసంబద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని వైసీపీ నాయకులు అన్నారు. సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా పర్యటనను విమర్శించడం, తిరిగి ఎదురుదాడికి దిగడం సరికాదని అభిప్రాయపడ్డారు. కాలనీవాసుల ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకంటే ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.




## అనుమతులు లేని విద్యాసంస్థలను సీజ్ చేయాలి

**- ట్వింకిల్ కిడ్స్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**

**- విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్నా పట్టించుకోని అధికారులు**

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రవికుమార్**




**పలాస/శ్రీకాకుళం, అక్టోబరు 10 (వార్త):** నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలు నిర్వహిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్వింకిల్ కిడ్స్ విద్యాసంస్థలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు నిర్ధారణైతే వాటిని సీజ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) శ్రీకాకుళం జిల్లా సమితి డిమాండ్ చేసింది. విద్య పేరుతో వ్యాపారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి. సోమశేఖర్, జిల్లా కార్యదర్శి సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ట్వింకిల్ కిడ్స్ విద్యాసంస్థలు అవసరమైన అనుమతులు పొందాయా లేదా అనే అంశంపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనుమతులు, విద్యా ప్రమాణాలు, ఫీజుల వసూళ్లు, పుస్తకాల విక్రయాలు, ఉపాధ్యాయుల అర్హతలు, మౌలిక సదుపాయాలపై తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలన్నారు. టెక్నో, సీ బ్యాచ్, ఐపీఎల్, ఎంపీఎల్, సీబీఎస్ఈ తదితర పేర్లతో తల్లిదండ్రులకు ఆకర్షణీయమైన ప్రచారం చేస్తూ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు నాయకులు ఆరోపించారు. వివిధ తరగతి విభాగాలు, ప్రత్యేక బృందాల పేర్లతో విద్యార్థులను వేర్వేరు సమూహాలుగా విభజించి, ఒక్కో విభాగానికి ఒక్కో రకమైన ఫీజు నిర్ణయించి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. పాఠ్యపుస్తకాల విక్రయాల్లోనూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు విచారణ జరపాలని కోరారు. ఒక్కో విద్యార్థికి పుస్తకాల కోసం రూ.10 వేల నుంచి రూ.22 వేల వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు చదువుతోపాటు శారీరక వికాసం, క్రీడలు కూడా అవసరమని ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. జిల్లాలోని ట్వింకిల్ కిడ్స్ విద్యాసంస్థల శాఖల్లో క్రీడా మైదానాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అన్నది పరిశీలించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా, వారి సంపూర్ణ వికాసానికి అవసరమైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల విద్యార్హతలు, నియామక నిబంధనల అమలుపై సందేహాలు ఉన్నాయని నాయకులు తెలిపారు. సంబంధిత విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయుల అర్హత పత్రాలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించారా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని కోరారు. విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి, ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణైతే సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు స్పందించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కౌశిక్, మనోజ్, సాయికుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## హరిపురం-బాలిగాం జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు

**-డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జంక్షన్‌గా పేరు మార్పు**

**-ఎస్సీ సంఘాల నాయకులకు ఎమ్మెల్యే గౌతు శిరీష హామీ**

**మందస, అక్టోబరు 10(వార్త):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు, సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పలాస ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష కొనియాడారు. మందస మండలానికి చెందిన దళిత నాయకులంతా ఎంఎల్ఏ శిరీషాను మర్యాదపూర్వకంగా కలిసారు. మందస మండలంలోని హరిపురం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జంక్షన్ మధ్యలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మందస మండల ఎస్సీ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే శిరీషాను కోరుతూ ఈ మేరకు సంఘాల ఆధ్వర్యంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జంక్షన్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రహదారి మధ్యలోని డివైడర్‌పై ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హరిపురం--బాలిగాం జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆ కూడలికి అంబేద్కర్ జంక్షన్ గా నామకరణం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గౌతు శిరీష సానుకూలంగా హామీ ఇచ్చారు. అంబేద్కర్ విగ్రహాన్ని జంక్షన్ మధ్యలో ఏర్పాటు చేయడంతో పాటు, ఆ కూడలికి అంబేద్కర్ జంక్షన్‌గా నామకరణం చేసే అంశాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలియజేసినందుకు ఆయా సంఘాల ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మందస మండల ఎస్సీ సంఘాల అధ్యక్షుడు కొత్తపల్లి మోహనరావు, బడియ కామరాజు, బడియ వల్లభరావు, బడియా కృష్ణారావు, సంక కాళిదాసు, పిలక శ్రీనివాస్, నగిరి నరసింహమూర్తి, నగిరి గోవింద్ తో పాటు పలువురు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సమరశీల పోరాటాలే సత్యం మాస్టారుకు నివాళి

## -వర్తమాన రాజకీయ పరిస్థితులు-మన కర్తవ్యం'పై మందసలో సదస్సు




**మందస, అక్టోబరు 10(వార్త):** కార్పొరేట్ హిందుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేయడమే కామ్రేడ్ కొల్లి సత్యం మాస్టారికి మనమిచ్చే ఘనమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. మందస పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో కామ్రేడ్ కొల్లి సత్యం మాస్టరి 3వ వర్ధంతి సందర్భంగా 'వర్తమాన రాజకీయ పరిస్థితులు-మన కర్తవ్యం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం నయా ఉదారవాద, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాలతో ప్రజలపైన, కార్మిక వర్గం పైన, రైతాంగం పైన తీవ్రమైన దాడి చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్ల పేరుతో కార్మికులను కట్టు బానిసలుగా చేసే చట్టాలను బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో నిరంకుశంగా ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకుందని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం హిందుత్వ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి అడుగడుగునా మత విద్వేషాలు రెచ్చగొడుతోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దీనివల్ల సామాన్య ప్రజలు, కార్మిక వర్గం బతుకు జీవనం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రజల ఆదాయాలు, కార్మిక వర్గ వేతనాలు పెరగడం లేదని అన్నారు.

బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా జెన్-జి ఉద్యమాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. జిల్లాలో జీడికి గిట్టుబాటు ధర ఇస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి ఇచ్ఛాపురం వరకు నీరు ఇస్తామని, జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని, రిమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా ప్రమోట్ చేస్తామని ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కార్గో ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సదస్సు ప్రారంభానికి ముందు సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ కొల్లి సత్యనారాయణ చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి కడమటి కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీఐటీయు నాయకులు గణపతి, ఆర్.దిలీప్ కుమార్, రైతు సంఘం నాయకులు యం.ధర్మారావు, పి.దేవేంద్ర, మండల సిఐటియు నాయకులు యస్. వల్లభ, ఏ.కృష్ణారావు, పి.చిరంజీవి, టి.లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ నాయకులు బమ్మిడి కృష్ణారావు, కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కొమర వాసు, స్పందన స్వచ్ఛంద సంస్థ నాయకులు టి.గణేష్, జీడి సంఘం నాయకులు జి.బాలమ్మ, కె.శాంతమ్మ, యం.చంద్రకళ, సుజాత, మీన, సిహెచ్ జానకమ్మ, డి.భారతమ్మ, ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు కె.రమేష్, రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు కె.కృష్ణారావు, బి.మల్లేసు, ఆర్.ఏకాశి, రైతు సంఘం నాయకులు టి.రాజుతో పాటు జీడి, రైస్ మిల్లు, హమాలీ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## చలో రాజ్‌భవన్ ఆందోళనలో అన్నాజీరావు అరెస్టు




**నరసన్నపేట, అక్టోబరు 10 (వార్త):** విజయవాడలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన చలో రాజ్‌భవన్ నిరసన కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ అరెస్టయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారాలపై నిరసన వ్యక్తం చేస్తూ చేపట్టిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొనగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నట్లు అన్నాజీ రావు తెలిపారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి నాయకులు నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో, అక్కడ పోలీసులు చేపట్టిన అరెస్టులకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఆందోళన నిర్వహించినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో విజయవాడలో చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి రాష్ట్ర ఇన్‌చార్జి, పలువురు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు హాజరై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడాన్ని సనపల అన్నాజీ రావు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం, నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున ప్రశ్నించడం, ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేయడం రాజకీయ పార్టీల హక్కు అని ఆయన పేర్కొన్నారు. నిరసన కార్యక్రమాలను అణచివేసేందుకు అరెస్టులను ఆశ్రయించడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని, నిరసన తెలిపే వారిపై అక్రమ అరెస్టులకు పాల్పడకూడదని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.

## శిథిలావస్థలో పాత ఎంపీడీవో కార్యాలయం

- ప్రమాదం పొంచి ఉందని సిబ్బంది ఆందోళన
- అదే భవనంలో కొనసాగుతున్న ఎంఆర్సీ, ఉపాధి ఏపీడీ కార్యాలయాలు
- కనీసం మరమ్మతులైనా చేపట్టాలని విజ్ఞప్తి

**నరసన్నపేట, అక్టోబరు 10 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. భవనం పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్నప్పటికీ, ప్రస్తుతం అదే భవనంలో కార్యాలయాలు కొనసాగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వారు భయాందోళనకు గురవుతున్నారు. ఎంపీడీవో కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చినప్పటికీ, పాత భవనంలో మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ), ఉపాధి ఏపీడీ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. దీంతో ఆయా కార్యాలయాలకు వచ్చే సిబ్బంది, ఇతరులు శిథిల భవనంలోనే తమ కార్యకలాపాలు నిర్వహించాల్సి వస్తోంది. భవనం పూర్తిగా దెబ్బతినడంతో విధుల నిర్వహణ సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు భవనం పరిస్థితిని పరిశీలించి, ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేందుకు అవకాశం లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, లేదంటే కనీసం అవసరమైన మరమ్మతులైనా చేపట్టి భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని సిబ్బంది కోరుతున్నారు.



## నిరసన హక్కును కాలరాయొద్దు




**పలాస, అక్టోబరు 10 (వార్త):** ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నించడం, నిరసనలు తెలియజేయడం రాజ్యాంగం కల్పించిన హక్కులని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులు, యువజనులపై ఢిల్లీ పోలీసులు చేపట్టిన అరెస్టులను వారు తీవ్రంగా ఖండించారు. కోసంగిపురం జంక్షన్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎదురైన ఆటంకాలను అధిగమించి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, యువజనులకు పార్టీ రాష్ట్ర కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్న శక్తులన్నీ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో నిరసన కార్యక్రమానికి హాజరయ్యేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు రవాణా పరంగా తీవ్ర ఇబ్బందులు కలిగించారని వారు ఆరోపించారు. సుమారు 17 రైళ్లను రద్దు చేయడంతోపాటు మెట్రో రైలు సేవలకు అంతరాయం కలిగించారని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకోవడం, ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ అత్యంత కీలకమని తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు అన్నారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపించారు. తొలగించిన పేర్లపై సమగ్ర పరిశీలన చేపట్టి, అర్హులైన ఓటర్లందరి పేర్లను తిరిగి జాబితాలో చేర్చాలని కోరారు. ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు స్పష్టత కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని, వివాదాస్పదంగా పేర్కొంటున్న ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ఈ అంశాలపై స్పష్టత వచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని వారు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత యువతతోపాటు ప్రతి పౌరుడిపై ఉందని వారు వెల్లడించారు. ప్రజల హక్కులకు భంగం కలిగించే చర్యలను ప్రశ్నిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు కుత్తుం లోకనాథం, అఖిల భారత ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు కుత్తుం దుష్యంత్‌రావు, పిన్నింటి నాగేశ్వరరావు, రైతు నాయకులు పోతన్నపల్లి అప్పారావు, విప్లవ యువజన సంఘం జిల్లా నాయకులు మద్దిల కైలాస్, మద్దిల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకు ప్రతిరూపం మాజీ ఎంపీ కణితి

### -కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలిలో కాంస్య విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

### -మున్సిపల్ కమిషనర్‌కు వినతి..

### -సానుకూలంగా స్పందించిన కమిషనర్



**పలాస, అక్టోబరు 10 (వార్త):** పలాస--కాశీబుగ్గ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేసి, విద్యా, వైద్య, సామాజిక సేవల ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత పార్లమెంటు మాజీ సభ్యుడు డాక్టర్ కణితి విశ్వనాథం స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, జిల్లా సేవా సంకల్ప అభియాన్ సహ కన్వీనర్ పాలవలస వైకుంఠరావు, మాజీ పలాస నియోజకవర్గ కన్వీనర్, జిల్లా సేవా సంకల్ప అభియాన్ సహ కన్వీనర్ రామానంద స్వామీజీలు అన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలిలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. పలాస--కాశీబుగ్గ ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి డాక్టర్ కణితి విశ్వనాథం విశేషంగా కృషి చేశారని వారు వివరించారు. ఆర్టీసీ ప్రాంగణం, విద్యుత్తు ఉపకేంద్రం, రైల్వే స్టేషన్ అభివృద్ధి, పలు రైళ్ల నిలుపుదల వంటి సదుపాయాల కల్పనలో ఆయన పాత్ర చిరస్మరణీయమని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యమివ్వడమే కాకుండా విద్య, వైద్య రంగాల్లోనూ తనదైన ముద్ర వేశారని తెలిపారు. విద్య ద్వారానే పేద కుటుంబాల జీవితాల్లో మార్పు సాధ్యమనే నమ్మకంతో ఆయన తన సొంత భూమి, నిధులను విద్యాభివృద్ధికి వినియోగించారని వివరించారు. పలాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలం కోసం మూడు ఎకరాల సొంత భూమిని అందించడంతోపాటు, పారిశ్రామిక శిక్షణ సంస్థ ఏర్పాటుకు మూడు ఎకరాల 50 సెంట్ల భూమిని ప్రభుత్వానికి ఉచితంగా రాసిచ్చారని తెలిపారు. పేద విద్యార్థుల చదువుకు ఉపయోగపడే భవన నిర్మాణానికి సొంత నిధులు వెచ్చించారని చెప్పారు. దూరప్రాంతాల నుంచి వచ్చి చదువుకునే విద్యార్థులకు వసతి కల్పించాలనే ఉద్దేశంతో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో వసతి గృహాన్ని నిర్మించడం ఆయన విద్యాసేవా దృక్పథానికి నిదర్శనమని అన్నారు. ఎందరో పేద, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉన్నత విద్య, వైద్య విద్య అభ్యసించేందుకు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందించి, వారి భవిష్యత్తుకు బాటలు వేశారని గుర్తుచేశారు. పూండి సమీపంలోని గోవిందపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ బెండి కూర్మన్నతో చర్చించి ఐదు ఎకరాల భూమిని ఉచితంగా సమకూర్చడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. పాఠశాల భవనాల నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణలోనూ చొరవ చూపి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యావకాశాలు అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. విద్యాసేవలతోపాటు ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించడంలోనూ డాక్టర్ కణితి విశ్వనాథం ముందుండేవారని తెలిపారు. లయన్స్ జిల్లా గవర్నర్‌గా పనిచేసిన సమయంలోనూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజహితానికి కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని కుటుంబ సభ్యులు సైతం సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమని అన్నారు.

విగ్రహ ఏర్పాటుకు కమిషనర్ సానుకూలత

ప్రజా సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడి సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలంటే కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలిలో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం సముచితమని వినతిపత్రంలో కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, ఇటువంటి ప్రజాసేవకుల స్ఫూర్తి ఈ ప్రాంతానికి అవసరమని, విగ్రహ ఏర్పాటుకు తప్పకుండా స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. డాక్టర్ కణితి విశ్వనాథం వంటి నాయకుల సేవలను స్మరించుకోవడం కేవలం నివాళి మాత్రమే కాదని, ప్రజాసేవ, విద్యాభివృద్ధి, సామాజిక బాధ్యతల పట్ల నేటి తరానికి స్ఫూర్తినిచ్చే ప్రయత్నమని వారు అభిప్రాయపడ్డారు.

## యువకుడికి విజయ్ బ్రదర్స్ అండ



**పలాస, అక్టోబరు 10 (వార్త):** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలును కోల్పోయిన యువకుడికి కొత్తపేట గ్రామానికి చెందిన విజయ్ బ్రదర్స్ ఆపన్నహస్తం అందించారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం పెద్ద అంగవానిపేట గ్రామానికి చెందిన అంగ ధర్మారావు (18) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, వైద్యులు ఆయన కాలును తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న విజయ్ బ్రదర్స్ శనివారం బాధిత యువకుడిని పరామర్శించి, వైద్య చికిత్సలు, తదుపరి అవసరాల నిమిత్తం రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ బ్రదర్స్ మాట్లాడుతూ ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన యువకుడికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన ప్రజలకు ఎలాంటి కష్టం ఎదురైనా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఆపదలో ఉన్నవారికి తోడ్పాటు అందించడం ద్వారా బాధిత కుటుంబాలకు కొంత ఊరట కలిగించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలపాడు మాజీ సర్పంచి షణ్ముఖరావు, కొత్తపేట మాజీ సర్పంచి పాపారావు, కంబాలరాయుడుపేట మాజీ సర్పంచులు చిరంజీవి, కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛావతి ఆలయంలో దసరా ఉత్సవాలు



**ఇచ్ఛాపురం, అక్టోబరు 10 (వార్త):** గ్రామ దేవత స్వేచ్ఛ వతి అమ్మవారి ఆలయం లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కి ఆలయం సిద్ధం అయ్యింది. నవరాత్రుల్లో అమ్మవారు తొమ్మిది రోజులు పాటు తొమ్మిది రూపాల్లో భక్తులు కి దర్శనం ఇస్తారు.శైలపుత్రి,.బ్రాహ్మచారిని, .చంద్రఘంటా, .కూష్మాండా, .స్కందమాత, .కాత్యాయని, .కాళరాత్రి, .మహాగౌరి, .సిద్ధి ధాత్రి. రూపాల్లో దర్శనం ఇస్తారు. అమ్మవారు శాంతి స్వరూపిని కావడం తో విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయం తరహా లో రూపాలు దరిస్తారు.ఈ నెల 11 నుండి 19 వరకు నవరాత్రి ఉత్సవాలు కి ఆలయ కమిటీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి రోజులు అభిషేకాలు, మర్ధన, హోమం నామర్చన హారతి పారాయణం ఉంటుంది. సంగీత కచేరి కోలాటం ఉంటుంది. 16 సామూహిక అక్షరభ్యాసం 20 న విజయదశమి. 19 పూర్ణహుతి 21 నిమ్మజ్జనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

## శిథిలావస్థకు చేరిన ఫుట్‌పాత్ వంతెన

- వంతెన దెబ్బతినడంతో రైతులకు తప్పని ప్రమాద భయం
- దశాబ్దాల క్రితం నిర్మించిన ఐరన్ వంతెనకు మరమ్మతులు కరువు
- వంశధార అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి

**జలుమూరు, అక్టోబరు 10 (వార్త):** సుబ్రహ్మణ్యంపురం సమీపంలో వంశధార ఎడమ కాలువపై రైతుల రాకపోకల కోసం నిర్మించిన ఫుట్‌పాత్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఈ ఇనుప వంతెన ప్రస్తుతం తుప్పుపట్టి పూర్తిగా దెబ్బతినడంతో దానిపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెనను ప్రధానంగా రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వినియోగిస్తున్నారు. అయితే, వంతెన ఇనుప భాగాలు తుప్పుపట్టి బలహీనపడటంతో దానిపై నడిచి వెళ్లేవారు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే రైతులు, ఇతర స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన దెబ్బతిన్నప్పటికీ ఇప్పటివరకు తగిన మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వంతెన పరిస్థితిని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. మరమ్మతులతో సమస్య పరిష్కారం కాని పక్షంలో కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వంశధార అధికారులు తక్షణమే స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని, రైతుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సుబ్రహ్మణ్యంపురం పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అర్హులైన రైతులకు పాసు పుస్తకాలు



**జి.సిగడాం, అక్టోబరు 10(వార్త):** అర్హులైన రైతుకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని మండల టిడిపి అద్యక్షులు కుమరాపు రవికుమార్ తెలిపారు. శనివారం డి.ఆర్ వలస గ్రామం స్థానిక నాయకులు రెవెన్యూ సబ్బంది కలిసి నా భూమి నాహక్కు 560 పట్టా పాస్ పుస్తకాలను భూ యాజమాన్య రైతులకు పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాజముద్రతో కాకుండా తప్పులు తడకలతో కూడిన పాస్‌పుస్తకాలు అందజేయడంతో అవి పనికిరాకుండా పోయాయ ని తెలిపారు.పాస్‌పుస్తకాల ప్రింటింగ్‌లో తప్పులు ఉన్నాయి వాటిని సరిచేసి మరో రెండు మూడురోజుల్లో అధికారులు అందజేస్తారని తెలిపారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్‌చట్టం తీసుకురావడంపై విమర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, రైతులు, విర్వో సాయి ఉన్నారు.

## శ్రవణానందం.. శ్రీచక్రపెరుమాళ్ సంగీతం



**మందస, అక్టోబరు 10(వార్త):** శ్రీచక్రపెరుమాళ్ భక్తి రంజని సంకీర్తనలు శ్రవణానందం కావించాయి. కళాకారులు ఆలపించిన కీర్తనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మందస పట్టణంలోని శ్రీకిల్లమ్మతల్లి దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. ప్రతీ రోజూ వందలాది మంది భక్తులు కిల్లమ్మతల్లిని దర్శించుకుంటున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా కవిటి మండలానికి చెందిన శ్రీ చక్ర పెరుమాళ్ భక్తిరంజని కళాకారులు భక్తి సంగీతాన్ని వీనులవిందుగా వినిపించారు. పొందల శ్రీనివాస్ గాత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీనివాస్ ఆలపించి కీర్తనలు, భక్తి పాటలు రాగ, తాళ, భావయుక్తంగా ఉన్నాయి. అదేవిధంగా కీబోర్డ్ హేమంత్ కుమార్, తబలా కుర్మారావు చక్కని సహకరించారు. శంకర్ డి.టి.ఎక్స్ ను ఎంతో చక్కగా చేశారు. మందస గ్రామస్తులతో పాటు అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు కూడా భక్తి సంగీతాన్ని చక్కగా ఆస్వాదించారు. అనంతరం శ్రీచక్రపెరుమాళ్ భక్తి రంజని కళాకారులను ఘనంగా సన్మానించి, వారి కళాసేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పొందల శ్రీనివాస్ మాట్లాడుతూ తమకు చేసిన సన్మానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మందస గ్రామపెద్దలు దేవరశెట్టి మార్కండేయులు, ప్రభాకర్ పట్నాయిక్, ఇప్పిలి వెంకటేశ్వరరావు, కరతల తిరుపతిరావు, కిల్లంశెట్టి నాగేశ్వరరావులతో పాటు గ్రామపెద్దలు, శ్రీకిల్లమ్మతల్లి ఉత్సవాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కంచమ్మ ఆలయంలో నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు

**కంచిలి, అక్టోబరు 10 (వార్త):** కంచిలి గ్రామ ఇలవేల్పు శ్రీ కంచమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. అమ్మవారు నవరాత్రులలో ప్రతిరోజు ఒక ప్రత్యేక అవతారం ద్వారా భక్తులకు దర్శనమివ్వనుంది. ఈ ఉత్సవాలలో ప్రతిరోజు జరిగే వేడుకలలో భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.



# కార్యదక్షుడు కుందు



### -వాల్తేర్ డివిజన్ పురోగతిలో కీలకపాత్ర
### - ఏడీఆర్ ఎం గా ప్రశంసలందుకుంటున్న మత్స్యకార ముద్దుబిడ్డ
### - ఏడాది కాలంలోనే రైల్వేలో విశేష ప్రగతి

(సోంపేట)

దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో అత్యంత కీలకమైన వాల్తేర్ డివిజన్ పురోగతిలో అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న కుందు రామారావు అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే తన పరిధిలోని అనేక అంశాలలో ప్రత్యేక దృష్టి సారించి విశేష సేవలతో రైల్వేలో అందరినీ ఆకట్టుకున్నారు. ఆయన పనిచేసిన ఏడాది కాలంలో సాధించిన ప్రగతి పట్ల అనేక వర్గాల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి.

సోంపేట మండలం తీర గ్రామమైన ఎర్రముక్కాంలో మత్స్యకార కుటుంబంలో



జన్మించిన కుందు రామారావు అంచలంచెలుగా ఎదిగి ఉన్నత విద్యాభ్యాసం ద్వారా రైల్వేలో పలు బాధ్యతలు నిర్వహించి గత ఏడాది కొత్తగా ఏర్పాటు అయిన వాల్తేర్ డివిజన్ కు ఏడీఆర్ ఎంగా నియమితులయ్యారు.

### సమర్థ నాయకత్వంతో అభివృద్ధి:

ఏ రంగంలోనైనా అభివృద్ధిని సాధించేందుకు సమర్థవంతమైన నాయకత్వం చాలా ముఖ్యమని రామారావు నిరూపించారు. బాధ్యతలు స్వీకరించిన తొలి రోజు నుంచే తన డివిజన్ అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించారు. ఇప్పటివరకు రైల్వే ప్రగతిలో అనేక మైలురాళ్లను నమోదు చేశారు. సమర్థవంతమైన నాయకత్వం, వేగవంతమైన నిర్ణయాలతో డివిజన్ పురోగతిపై తన లక్ష్యాన్ని గురిపెట్టి ప్రయాణికుల రైళ్ల వేగాన్ని పెంచడానికి కృషి చేస్తూ డివిజన్ వ్యాప్తంగా మిగిలి ఉన్న కీలక మార్గాల్లో ట్రాక్ ద్విగుణీకరణ తోపాటు నూరు శాతం విద్యుదీకరణ పనులను మరింత వేగవంతం చేశారు. అమృత్భారత్ పథకం కింద డివిజన్ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్ వంటి ప్రధాన రైల్వే స్టేషన్లను అత్యుత్తమ ప్రమాణాలతో ఆధునికరించే పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. వందే భారత్ రైళ్ల నిర్వహణ, వందే భారత్ ఎక్స్ప్రెస్ రైళ్ల నిర్వహణ అలాగే సమయపాలనలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. స్టేషన్లో ప్రయాణికుల సమాచార వ్యవస్థను మెరుగుపరచడం, ఉచిత హై స్పీడ్ వైఫై సౌకర్యాలు విస్తరించడం తోపాటు ఇచ్ఛాపురం, జాడుపూడి రైల్వే స్టేషన్ల మధ్య సబ్ వే నిర్మాణానికి ఇటీవల కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో శంకుస్థాపన చేయించడం వంటి కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. శ్రీకాకుళం, పలాస, విజయనగరం, ఇచ్ఛాపురం వంటి రైల్వే స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసి ప్రయాణికుల భద్రత కోసం కీలక సూచనలు సలహాలను స్థానిక అధికారులకు అందిస్తున్నారు.

### ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా :

ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా ప్రమాదకర లెవల్ క్రాసింగ్ ల స్థానంలో రోడ్డు అండర్ బ్రిడ్జిలు, రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని రామారావు ప్రత్యేక పర్యవేక్షణలో మరింత వేగవంతం చేశారు. రైలు ప్రమాదాల నివారణకు దేశీయంగా అభివృద్ధి చేసిన కవచ్ వ్యవస్థను డివిజన్లో వేగంగా అమర్చే పనులకు శ్రీకారం చుట్టారు.పలాస, ఇచ్ఛాపురం పరిధిలో రైల్వే ఉద్యోగులకు రిటైర్డ్ ఉద్యోగులకు పలాసలో రిఫరల్ హాస్పిటల్ కోసం రామారావు మరింతగా కృషి చేస్తున్నారు. ఈ కల సాకారమైతే రైల్వే ఉద్యోగులకు మరింత ఊరట లభిస్తుంది.

### యువత మోసపోవద్దు:

రైల్వే ఉద్యోగాల పేరిట మధ్యవర్తులు, ఏజెంట్లను నమ్మి యువకులు మోసపోవద్దని రామారావు పేర్కొంటున్నారు. ఉద్యోగాల పేరిట ఎరచూపితే వెంటనే రైల్వే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత ఉద్యోగాలకు గట్టిగా ప్రయత్నించాలని కోరారు.

### ఉద్దానానికి గర్వ కారణం :

పేద కుటుంబంలో పుట్టి రైల్వేలో అత్యున్నత హోదాలో విశేష సేవలు అందిస్తున్న కుందు రామారావు ఉద్దానం ప్రాంతానికి గర్వకారణమని పలువురు పేర్కొంటున్నారు. ఉద్దానం యువతకు ఆయన ఒక స్ఫూర్తి అని చెప్పవచ్చు. రామారావు ఆదర్శంగా విద్యార్థులు భవిష్యత్తులో మంచి అవకాశాలు సాధించాలని అనేకమంది కోరుతున్నారు.

# ప్రజాభిప్రాయం లేకుండానే మైనింగా

### -భూసర్వే అనుమతులు ఎలా ఇస్తారు
### -మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్
### - మైనింగ్ భూసర్వే పనులను నిలిపివేయాలని రైతులు అందోళన

**జి.సిగడాం, అక్టోబర్ 10(వార్త):**

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే మైనింగ్ భూసర్వే ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు ఎలా తయారు చేస్తారని వేదాంత కంపెనీ సిబ్బంది భూ సర్వే నిర్వహించడాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. శనివారం పున్నాం గ్రామ ప్రజలు, మహిళలు, రైతలు భాతువ గ్రామ రైతులు కలిసి వేదాంతా కంపెనీకు వ్యతిరేఖంగా ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొని నిరసన కధం తొక్కారు.రైతన్నలకు మాజీ ఎమ్మెల్యే సంఘీభావాన్ని తెలిపారు. వేదాంత మైనింగ్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనింగ్ ఏర్పాటు చేసే గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయం తీసుకోవాలనే నిబంధనలు కూడా పాటించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అయినా అధికారులు ఇవేమీ పట్టనట్లుగా మైనింగ్ పనులకు ఎలా ప్రారంభించమని జీవోలు ఇస్తున్నారని ప్రశ్నించారు. దీంతో స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న అందోళల చెందవద్దని ప్రజలకు వైస్ ఆర్ సీపీ పార్టీ అండగా ఉంటుందన్నారు.

వేదాంత మైనింగ్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తరతరాలుగా భూములను నమ్ముకుని జీవిస్తున్న రైతుల అభిప్రాయాలను, అనుమతులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా కంపెనీ ప్రతినిధులు ఇష్టారాజ్యంగా సర్వేలు చేయడం దారుణమని మండిపడ్డారు. ఇది స్థానిక రైతాంగ ప్రయోజనాలకు విఘాతం కలిగించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.రైతుల అనుమతి లేకుండా చేపడుతున్న అన్ని రకాల సర్వే చర్యలను మైనింగ్ కంపెనీ, అధికార యంత్రాంగం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసారు.రైతుల హక్కులను కాలరాసేలా కంపెనీలు వ్యవహరిస్తే సహించేదే లేదని బాధితులైన రైతుల పక్షాన నిలబడి ఏ స్థాయి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. రైతాంగానికి అన్యాయం జరగకుండా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు డోల వెంకటరమణ, రాష్ట్ర అర్.టి.ఐ. సంయుక్త కార్యదర్శి మీసాల వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ కాయల వెంకట రమణ, పిల్లల శివ కుమార్, కంది రమాదేవి, తొత్తడి రామారావు, జేఏసీ కమీటీ గ్రామ స్థానిక నాయులు, కార్యకర్తలు, రైతన్నలు భారీగా పాల్గొన్నారు.



# రెవెన్యూ శాఖలో పనికో రేటు.. రైతుల ఆవేదన!

### - వివిధ ధ్రువపత్రాలు, భూ సంబంధిత పనులకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ఆరోపణలు
### - రీ సర్వే పేరుతో రైతుల నుంచి వసూళ్లు
### - ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి




**జలుమూరు, అక్టోబర్ 10 (వార్త):** రెవెన్యూ శాఖలో వివిధ పనులు చేయించుకోవాలంటే డబ్బులు చెల్లించాల్సి వస్తోందని రైతులు, సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరమైన ధ్రువపత్రాలు పొందడం, భూముల మ్యుటేషన్, ఎఫ్ఎంసీ, నాలా తదితర రెవెన్యూ సేవల కోసం కార్యాలయాలను ఆశ్రయిస్తున్న ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు వాపోతున్నట్లు సమాచారం. డబ్బులు ఇవ్వనిదే ఫైళ్లు ముందుకు కదలడం లేదన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా భూముల రీ సర్వే ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి రైతులకు పలు కారణాలు చూపిస్తూ పనులు ఆలస్యం చేస్తున్నారని, సమస్యల పరిష్కారం కోసం సిబ్బందికి డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని కొందరు రైతులు ఆరోపిస్తున్నట్లు తెలుస్తోంది. భూములకు సంబంధించిన రికార్డుల్లో మార్పులు, సవరణలు చేయించుకోవడం, ఇతర భూ సంబంధిత సేవలు పొందడం కోసం పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభుత్వ భూములు, కొండ ప్రాంత భూములు, చెరువులకు సంబంధించిన భూములు, వంశధార పరిధిలోని భూముల విషయంలోనూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ప్రచారం స్థానికంగా జరుగుతోంది. అర్హతలు, భూముల వాస్తవ పరిస్థితులతో సంబంధం లేకుండా డబ్బులు చెల్లిస్తే రికార్డుల్లో పేర్లు నమోదు అవుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది. గతంలో జగనన్న రాళ్లపాతే పథకం అమలు సమయంలోనూ రైతుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయని, ప్రభుత్వం నుంచి విడుదలైన నిధుల వినియోగంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పలువురు రాజకీయ నాయకులు విమర్శిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారాలపై సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రెవెన్యూ శాఖ ద్వారా అందాల్సిన సేవలు పారదర్శకంగా, నిర్ణీత సమయంలో ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా పేదలు, చిన్న, సన్నకారు రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, తప్పులు జరిగినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జిరాయితీని దేవాలయ భూములుగా మారుస్తున్నారు

### - 82 మంది రైతుల భూముల రికార్డుల మార్పుపై అభ్యంతరం
### - పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు పరిశీలించాలని విజ్ఞప్తి
### - తమకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను కోరుతున్న బాధిత రైతులు

**జలుమూరు, అక్టోబరు 10 (వార్త):**

శ్రీముఖలింగం గ్రామంలో జిరాయితీ భూములను దేవాదాయ శాఖ భూములుగా నమోదు చేస్తున్నారంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పూర్వీకుల కాలం నుంచి సాగులో ఉన్న భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఇతర రెవెన్యూ రికార్డులు తమ వద్ద ఉన్నప్పటికీ భూముల వివరాలను దేవాలయాల పేరుతో మారుస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

### 200 ఎకరాలకు పైగా దేవాలయ భూములు

రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయానికి సుమారు 30 ఎకరాలు, నరసింహస్వామి ఆలయానికి 128 ఎకరాలు, రాధాగో మఠానికి సుమారు 50 ఎకరాల భూములు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ భూములను రైతులు సాగు చేస్తూ దేవాలయాలకు ధాన్యం లేదా నగదు రూపంలో చెల్లింపులు చేస్తున్నారని వివరించారు. వీటికి అదనంగా సుమారు 82 మంది రైతులకు సంబంధించిన భూములను 2015--2016 సంవత్సరాల్లో దేవాదాయ శాఖ భూములుగా నమోదు చేసినట్లు వారు చెబుతున్నారు.

### పాత పత్రాలు ఉన్నా రికార్డుల మార్పు ఎలా?

1940 నుంచి 2018 వరకు భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఇతర రెవెన్యూ ఆధారాలు తమ వద్ద ఉన్నాయని రైతులు తెలిపారు. గతంలో నిర్వహించిన సర్వేలు, రెవెన్యూ విచారణల్లోనూ కొన్ని భూములు జిరాయితీ భూములేనని సంబంధిత అధికారులు లిఖితపూర్వకంగా తెలిపినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రస్తుత భూ రికార్డుల మార్పుల ప్రక్రియలో తమ పేర్లను తొలగించి దేవాలయాల పేరుతో వన్‌బీ, పాస్‌పుస్తకాలు జారీ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. భూముల యాజమాన్యానికి సంబంధించిన పత్రాలను పరిశీలించకుండా, తమకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తమ వాదన వినకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని రైతులు అభిప్రాయపడుతున్నారు. భూములపై హక్కులను నిర్ణయించే ముందు పాత రికార్డులు, సాగు వివరాలు, పన్నుల చెల్లింపులు, రిజిస్ట్రేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరుతున్నారు.

### అధికారులను కలిసినా పరిష్కారం లేదని ఆవేదన

ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే, కేంద్ర మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లినట్లు రైతులు తెలిపారు. తమ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరగా, శ్రీకాకుళం ఆర్డీవోను కలిసి తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలని, అవసరమైతే సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. అయితే, దిగువస్థాయి రెవెన్యూ సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు తమ సమస్యకు పరిష్కారం లభించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ భూముల వివరాలను ప్రశ్నించినందుకు కొందరు రైతులపై కేసులు నమోదు చేసి, పోలీస్‌స్టేషన్ వరకు తీసుకెళ్లినట్లు ఆరోపించారు. ఈ పరిణామాలు తమను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు.

### డబ్బుల వసూళ్లపైనా ఆరోపణలు





ఈ భూముల వ్యవహారంలో గతంలో పనిచేసిన ఓ మాజీ సర్పంచ్ రైతుల నుంచి రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు వసూలు చేసినట్లు కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. భూముల కొనుగోలుకు సంబంధించి తాము చెల్లించిన మొత్తాలు, తమ వద్ద ఉన్న ఆధారాలపై ప్రశ్నలు తలెత్తడంతో వివాదం మరింత ముదిరిందని వారు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర ధ్రువీకరణ అందుబాటులో లేదు. ఈధి ఇలా ఉండగా మాజీ సర్పంచ్ కొంత మంది పాలక పార్టీ రాజకీయ నాయకులు దగారీకీ వెల్లి ప్రశ్నించీన వారి పై పోలీసు కేసు నమోదు చెయిన్చారు.

### సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి

భూముల రికార్డుల మార్పుల విషయంలో తమ వాదన వినకుండా, పాత పత్రాలను పరిశీలించకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని గ్రామానికి చెందిన కొందరు పెద్దలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు గ్రామస్థాయిలో విచారణ నిర్వహించి, రైతుల వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, వన్‌బీ రికార్డులు, నీటి పన్ను రసీదులు తదితర ఆధారాలను పరిశీలించాలని కోరుతున్నారు. భూముల వాస్తవ యాజమాన్యాన్ని, రికార్డుల మార్పులకు సంబంధించిన కారణాలను చట్టపరంగా నిర్ధారించి, అర్హులైన రైతులకు న్యాయం చేయాలని బాధితులు పత్రికాముఖంగా విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులు స్పందించి నిష్పక్షపాత విచారణ చేపడతారా, తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546